పాతబస్తీకి ఆషాఢ బోనాల కళ..!

దశాబ్ది బోనాల జాతర పేరుతో ఉత్సవాలు నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- ఆలయాల వద్ద చకచకా ఏర్పాట్లు
- ఈ నెల 6న, మీరాలంమండి అమ్మవారికి మహాభిషేకం
- 7న గోల్కొండలో బంగారు బోనంతో ఆషాఢ మాసం బోనాలు షురూ
- పాతబస్తీలో పాటు నగరంలో 28న జాతర ఉత్సవాలు
- 29న, పాతబస్తీ వీధుల్లో అమ్మవారి ఘటాల సామూహిక ఊరేగింపు

చార్మినార్: పాతబస్తీకి ఆషాఢ మాసం బోనాల జాతర కళ వచ్చింది. ఈ నెల 6న, మీరాలం మండి మహంకాళేశ్వర అమ్మవారికి మహాభిషేకం పూజా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం దశాబ్ది ఆషాఢ బోనాల జాతర ఉత్సవాల పేరుతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ఏర్పాట్లపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో సంబంధిత ఉన్నతాధికారులు, ఉత్సవాల నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించి భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈనెల 7వ తేదీన గోల్కొండ జగదాంబిక అమ్మవారికి సమర్పించే మొదటి బంగారు బోనంతో పాతబస్తీలో బోనాల జాతర ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. సప్త మాతృకలకు సప్త బంగారు బోనం కార్యక్రమంలో భాగంగా నగరంలోని గోల్కొండ జగదాంబిక అమ్మవారికి, బల్కంపేట్ ఎల్లమ్మ తల్లి, జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లితో పాటు విజయవాడ కనక దుర్గమ్మ తల్లికి బంగారు పాత్రలో బోనాలు, పట్టు వస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించనున్నామని భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీత గాజుల అంజయ్య తెలిపారు.

తెలంగాణలో పాతబస్తీ బోనాలకు ప్రాధాన్యత..

నిజాం కాలం నుంచి ఇక్కడి అమ్మవారి ఆలయాల్లో పూజలు చేసి అమ్మవారికి ప్రత్యేకంగా తయారు చేసిన బోనాన్ని సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. తెలంగాణ సంస్కృతి, ఆచార వ్యవహారాలకు అద్దం పట్టేలా ఉత్సవాలు కన్నుల పండువగా జరుగుతాయి. రాష్ట్రంలోనే అత్యంత వైభవంగా జరిగే ఈ ఉత్సవాలు పాతబస్తీకి ప్రత్యేకతను చాటుతాయి. పాత బస్తీలో జరిగే అమ్మవారి ఘటాల సామూహిక ఊరేగింపు రోజు రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా పరిగణిస్తుంది. ఈసారి జరిగే ఉత్సవాల వివరాలను ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ప్రకటించారు.


బోనం బంగారు పాత్ర

ఈసారి ఆషాఢ మాసం బోనాల జాతర వివరాలిలా..

- ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలు ఈ నెల 7వ తేదీన గోల్కొండ అమ్మవారి బోనంతో ప్రారంభమవుతాయి.
- సప్త మాతృకలకు సప్త బంగారు బోనం కార్యక్రమంలో భాగంగా ఏడు అమ్మవారి ఆలయాలకు బంగారు పాత్రలో బోనంతో పాటు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.
- 10న, బల్కంపేట్ ఎల్లమ్మ తల్లికి బంగారు బోనంతో పటు పట్టు వస్త్రాల సమర్పణ..
- 12న, జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ తల్లికి..
- 14న, ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ బోనాల జాతర ఉత్సవాలుంటాయి. ఇందులో భాగంగా విజయవాడ కనక దుర్గా అమ్మవారికి పట్టు వస్త్రాలు, బంగారు పాత్రలో బోనం, కృష్ణ నదిలో గంగ తెప్పకు పూజలు తదితర కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు.
- 18న, సికింద్రాబాద్‌లో నిర్వహించే ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బోనాల సమర్పణ కార్యక్రమం కన్నుల పండువగా జరగనున్నది.
- 19న, పాతబస్తీలో అమ్మవారి కలశ స్థాపన, ధ్వజారోహనం
- 21న, సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి బోనాల సమర్పణ రోజే పాతబస్తీ శాలిబండలోని కాశీ విశ్వనాథ ఆలయం నుంచి ఘట స్థాపన ఊరేగింపు.
- 23న, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి పట్టు వస్త్రాలతో పాటు బోనం సమర్పణ.
- 25న, లాల్‌దర్వాజ సింహవాహిని అమ్మవారికి పట్టు వస్త్రాలు, బంగారు బోనం సమర్పించనున్నారు.
- 28న, నగరంతో పాటు పాతబస్తీలో బోనాల జాతర ఉత్సవాలు..అంటే అమ్మవారికి నైవేద్యం సమర్పణ.
- 29న పాతబస్తీ ప్రధాన వీధుల్లో అమ్మవారి ఘటాల సామూహిక ఊరేగింపు, తదనంతరం మారు బోనంతో ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలు ముగుస్తాయి.


మీరాలంమండి ఆలయంలో అమ్మవారు

కేటీఆర్‌ను కలిసిన ఆనంద్‌కుమార్ గౌడ్


కేటీఆర్‌తో ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ బుధవారం కలిశారు. నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులను వివరించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజల్లో ఉండే నాయకులను పార్టీ ఎప్పుడూ ఆదరిస్తుందని కేటీఆర్ పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరంతరం పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

టప్పాచబుత్ర డీఐగా అభిలాష్

విజయనగర్‌కాలనీ: టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా బి.అభిలాష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఈయన నాంపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఇప్పటివరకు టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్‌లో డీఐగా విధులు నిర్వహించిన మహ్మద్ ఆసిఫ్ కాలపత్తర్ ఇన్‌స్పెక్టర్‌గా ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఈ సందర్భంగా నూతన డీఐ మాట్లాడుతూ.. శాంతభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు స్థానిక పీస్, మైత్రి కమిటీల సభ్యులతో పాటు ప్రజలు సహకరించాలని కోరారు.

గోల్కొండ బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ ఎన్నిక


కాంత అరవింద్

లంగర్‌హౌస్: గోల్కొండ జగదాంబిక బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్‌గా కాంత అరవింద్ మహేశ్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేవాదాయ శాఖ అధికారులు కొద్దిరోజుల క్రితం 14 మంది సభ్యులతో కూడిన కమిటీని ప్రకటించారు. అయితే వారితో పాటు లంగర్ హౌస్ పెద్దలు, నాయకులు బుధవారం సమావేశమై చైర్మన్ ఎన్నికపై చర్చించారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ ఫోన్ ద్వారా చైర్మన్‌గా కాంత అరవింద్ పేరును ప్రతిపాదించగా అందరూ ఏకాభిప్రాయానికి వచ్చి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ.. తనకు అవకాశం కల్పించిన దానం నాగేందర్, మాజీ పీసీసీ కార్యదర్శి బండ సూరికి కృతజ్ఞతలు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో లంగర్‌హౌస్ నుంచి గోల్కొండ వరకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

బోనాలను విజయవంతం చేస్తాం


వృత్తిపని సంఘం సభ్యులతో సంఘం అధ్యక్షుడు సాయిబాబాచారి

గోల్కొండ: గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారి బోనాలను విజయవంతం చేసేందుకు సహాయ సహకారాలు అందిస్తామని గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి అన్నారు. గోల్కొండ బంజారా దర్వాజ వద్ద బుధవారం సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం జరిగిన సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ వృత్తి పని వారికి గౌరవ భృతిని రూ.5 వేలుగా ప్రకటించారన్నారు. భక్తితో పాటు దశాబ్దాలుగా వంశపారపర్యంగా వస్తున్న వృత్తితో అమ్మవారికి సేవలు అందిస్తున్నారన్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆదేశాలు, సూచనలను పాటిస్తూ అమ్మవారిని అలంకరిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బంజారి దర్వాజ బాబురావు, నర్సింగ్, మహంకాళి ఆలయ పూజారి సురేశ్‌చారి, విజయ్, వినోద్, ప్రసాద్, శివరాజ్, శివశంకర్, లీలావతి, సంగీతారాణి, రవి, సురేంద్ర తదితరులు ఉన్నారు.

కోటలో బోనాల ఏర్పాట్ల పరిశీలన


పూజల్లో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ, ఈవో శ్రీనివాసరాజు

గోల్కొండ: గోల్కొండ కోటలో ఈ నెల7న బోనాల జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏర్పాట్లను దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ, ఈవో శ్రీనివాసరాజుతో కలిసి బుధవారం కోటను సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాల కమిటీ, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం తరఫున బోనాలు నిర్వహించడంతో ఈసారి భక్తులు సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు, వృత్తిపని సంఘం సభ్యులు శంకర్, ఈ.శివశంకర్, శివ, రాములు ఉన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి, మజహరుల్లా తదితరులు

గోల్కొండ: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు సంఖ్య మరింత పెరగాలని హైదరాబాద్ జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జె.వెంకటి అన్నారు. గోల్కొండ ఏరియాసుపత్రిలో బుధవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆసుపత్రులను శుభ్రంగా ఉంచడంతో పాటు రౌండ్ ది క్లాక్ వైద్యులు అందుబాటులో ఉంటే సర్కారు దవాఖానలపై ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు. ఎక్కువగా నార్మల్ డెలివరీలు అయ్యేలా చూడాలని సూచించారు. సమన్వయంతో పనిచేస్తేనే ఇది సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహరుల్లా, గోల్కొండ క్లస్టర్ ఎస్‌పీహెచ్‌వో డాక్టర్ మురళీ, గోల్కొండ ఏరియాసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ వినాయక్‌రావు, ఆసుపత్రి గైనకాలజిస్ట్ నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మొహర్రంకు బందోబస్తు ఏర్పాటు చేయాలి


అదనపు డీజీపీకి వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

చార్మినార్: మొహర్రం సంతాప దినాలు కొద్దిరోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్ని ఆషూర్‌ఖానాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ, బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అల్కా మనోజ్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర అదనపు డీజీపీ (లా అండ్ ఆర్డర్) సంజయ్‌కుమార్ జైన్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆషూర్‌ఖానాల వద్ద షీ టీంలు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, స్థానిక షియా ముస్లిం నాయకులతో సమన్వయంగా ఉంటూ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని కోరామన్నారు.

సారిపల్లి కొండల్‌రావు జన్మదిన వేడుకలు


కొండల్‌రావును సన్మానిస్తున్న మండలి బుద్ధ ప్రసాద్, రమణాచారి

గన్‌ఫౌండ్రీ: యువ కళావాహిని, జంట నగరాల సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో సాంస్కృతిక బంధు సారిపల్లి కొండల్‌రావు జన్మదినం సందర్భంగా రవీంద్రభారతిలో సహస్రపూర్ణ అర్ధచంద్ర మహోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాసన సభ్యుడు మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ.. జానపద కళాకారుల సంక్షేమం, సాంస్కృతి రంగం అభివృద్ధికి నిత్యం పరితపించి వ్యక్తి కొండల్ రావు అని కొనియాడారు. అంతకుముందు ప్రముఖ నృత్య గురువు ఎస్‌పీ భారతి శిష్యబృందం చేసిన నృత్య ప్రదర్శనలు, జానపద కళాకారుల సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, యువకళావాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కబ్జాచేసిన శ్మశానవాటిక ప్రహరీ కూల్చివేత


శ్మశానవాటిక స్థల ప్రహరీ కూల్చివేసిన దృశ్యం

జియాగూడ: పురానాపూల్ జాతీయ రహదారి పక్కనే గల జియాగూడ ఇమాంపురా శ్మశానవాటిక స్థలాన్ని కబ్జా చేసి అక్రమంగా నిర్మించిన ప్రహరీని ఆసిఫ్‌నగర్ మండల కార్యాలయ సిబ్బంది కూల్చివేశారు. సెలవులు వచ్చిన ప్రతిసారి పథకం ప్రకారం భూ కబ్జాదారులు శ్మశానవాటిక స్థలాన్ని కబ్జాచేసేందుకు యత్నిస్తున్నారు. సమాచారం అందుకున్న ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ కిరణ్ ఘటనా స్థలానికి చేరుకుని తొలగించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమగ్రమైన సర్వే చేపట్టి ప్రభుత్వ స్థలాల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానిక బస్తీలవాసులు కోరుతున్నారు.

క్రమ శిక్షణతోనే ఉత్తమ ఫలితాలు

గోల్కొండ: క్రమ శిక్షణతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ ఉదయ్ కుమార్‌రెడ్డి అన్నారు. గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన బ్రీఫింగ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై గోల్కొండ కోట బోనాల ఏర్పాట్లు, విధి నిర్వహణలో పాటించాల్సిన విధానాలను వివరించారు. విధి నిర్వహణలో ముక్కుసూటిగా ఉండడమే కాకుండా పక్షపాతం లేకుండా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

విదేశీ విద్యకు ఎంపిక

గోల్కొండ: రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నార్త్ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ యూత్ ఎక్స్చేంజ్ ప్రోగాంలో భాగంగా నగరానికి చెందిన ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా ఖాజాగూడలోని డీపీఎస్ స్కూల్‌లో ఇంటర్ పూర్తి చేసిన గచ్చిబౌలిలోని ఖాజాగూడకు చెందిన గౌరీ బన్సల్ మెక్సికోలో, అదేవిధంగా అభయ వాల్‌డోర్ఫ్ స్కూల్‌లో 11వ తరగతి చదువుతున్న ఆర్కా చెంజీ బ్రెజిల్‌లోని కర్వెలోలో ఏడాది పాటు విద్యభ్యసించనున్నారు.

ఇతర ప్రాంతాల వారిని తొలగించాలి

లంగర్‌హౌస్: గోల్కొండ జగదాంబిక ఉత్సవ కమిటీ నియామకంపై పలువురు లంగర్‌హౌస్ పెద్దలు, నాయకులు మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. తెలంగాణలో బోనాల ఉత్సవాలు గోల్కొండ జగదాంబిక అమ్మవారికి తొలిబోనంతో ప్రారంభమవుతాయి. తొమ్మిది వారాల పాటు బోనాల ఉత్సవాలను కేవలం లంగర్‌హౌస్‌వాసుల చేతులమీదుగా జరిపించడం ఆనవాయితీగా వస్తున్నది. ఇటీవల 14 మందితో కూడిన కమిటీని దేవాదాయ శాఖ నియమించిందని ఇందులో ఇద్దరు లంగర్‌హౌస్‌వాసులు కాకుండా వేరే ప్రాంతం వారు ఉన్నారన్నా విషయం తెలుసుకున్న లంగర్‌హౌస్ బస్తీల పెద్దలు, పలు పార్టీల నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నారు. సంప్రదాయాలను చెడగొడితే ఊరుకునేది లేదన్నారు. కొందరి ఒత్తిడికి దేవాదాయ శాఖ అధికారులు లొంగి నియమించారని వెంటనే కమిటీ నుంచి కృష్ణమూర్తి, నవీన్‌ను తొలగించాలని హెచ్చరించారు.

మొహర్రానికి ముస్తాబు


ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

డబీర్‌పురా: ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకుని డబీర్‌పురా బీబీకా అలావాలో ఏర్పాట్లు చేస్తున్నారు. పెయింటింగ్, షెడ్ ఏర్పాట్లు తదితర పనులు చేపడుతున్నారు. భక్తులు ఆలంలను దర్శించుకుని పూలు, దట్టీలు సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నట్లు అలావా ముతవల్లీ ఆసిఫ్, ఐజాజ్ తెలిపారు.

ఉస్మానియాలో నిలిచిన విద్యుత్ సరఫరా


జనరేటర్‌ను ఆన్ చేస్తున్న అధికారులు

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక కారణాల వల్ల కొద్దిసేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దాదాపు 10 నుంచి 15 నిమిషాల పాటు అంతరాయం కలగడంతో ఓపీ, క్యాజువాల్టీ, కులీకుతుబ్ షా భవనంలో రోగులు ఇబ్బందులు పడ్డారు. స్పందించిన అధికారులు జనరేటర్‌తో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. జనరేటర్, బ్యాటరీ బ్యాక్‌అప్‌తో ఆపరేషన్ థియేటర్‌ల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ తెలిపారు.

నిలోఫర్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం


సమావేశమైన కమిటీ సభ్యులు

నాంపల్లి: నిలోఫర్ ఆసుపత్రి డెవలప్‌మెంట్ కమిటీ సర్వసభ్య సమావేశాన్ని స్థానిక ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హెచ్‌డీఎస్ చైర్మన్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆసుపత్రికి సంబంధించిన పలు అంశాలను చైర్మన్ శశాంక్ దృష్టికి తీసుకెళ్లారు. ఎంఆర్ఐ మిషన్, పీజీ హాస్టల్ ఏర్పాటు చేయాలని, హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ కంపెనీ మంజూరు చేసిన నిధుల విడుదల, పరికరాల కొనుగోలు, భవనాల నిర్మాణం, కొత్త సిటీ స్కానింగ్ మిషన్ కొనుగోలు వంటి అంశాలను ఎమ్మెల్యే ప్రస్తావించారు. హెచ్‌డీఎస్ చైర్మన్ సానుకూలంగా స్పందించడంతో సమావేశం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. కార్యక్రమంలో నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.ఉషారాణి, ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర కుమార్, టీజీజీడీఏ అధ్యక్షుడు డాక్టర్ వినోద్‌కుమార్, సీఎస్ఆర్ఎంఒ డాక్టర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను స్మరించుకోవాలి


రేమిల్ల వెంకట రామకృష్ణ శాస్త్రిని సన్మానిస్తున్న కేవీ.రమణాచారి తదితరులు

సుల్తాన్‌బజార్: శాస్త్రీయ కళలను విశ్వవ్యాప్తం చేసిన మహనీయులను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ. రమణాచారి అన్నారు. అబిడ్స్‌లోని తాజ్‌మహల్ హోటల్‌లో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, రాయసం ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్త రేమిల్ల వెంకటరామకృష్ణ శాస్త్రికి రాయసం సుబ్బారాయుడు పురస్కారాన్ని, ప్రముఖ రచయిత్రి ఇంద్రగంటి జానకీబాలకు రాయసం మహాలక్ష్మీ పురస్కారాలను ప్రదానం చేశారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై పురస్కార గ్రహీతలు వెంకట రామకృష్ణ శాస్త్రీ, జానకీ బాలను సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాయసం కుటుంబ సభ్యుల పూర్వీకుల పేరిట పురస్కారాలు ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. కిన్నెర సంస్థ విభిన్నమైన కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఆర్ఎస్ పి.రఘు, ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, నారుమంచి వెంకట అనంతకృష్ణ, డాక్టర్ ఆకునూరు విద్యాదేవి, మద్దాలి రఘురామ్, ఆర్ఎస్.రాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాలుడిని చేరదీసిన జీఆర్పీ పోలీసులు


బాలుడితో పోలీసులు

నాంపల్లి: ఇంట్లో నుంచి పారిపోయి రైల్వేస్టేషన్‌లో కనిపించిన ఓ బాలుడిని హైదరాబాద్ జీఆర్పీ పోలీసులు చేరదీశారు. వివరాలు అడిగి తెలుసుకున్న అనంతరం బాలుడిని చైల్డ్ హోంకు తరలించారు. హైదరాబాద్ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రం బలేశ్వర్ జిల్లా, సింగ్లా థానా, శార్థా గ్రామానికి చెందిన చైతన్య మండల్ కుమారుడు జై కిషన్ మండల్ (15) ఇంట్లో నుంచి పారిపోయి రైలెక్కి విజయవాడకు అక్కడి నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నాడు. రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారం నెం-4 మీద జై కిషన్ మండల్ బుధవారం కనిపించడంతో విధుల్లోని పోలీసులు చేరదీసి విచారించారు. తాను తొమ్మిదో తరగతి చదువుతున్నానని ఇంట్లో గొడవ పడి వచ్చినట్లు బాలుడు బదులిచ్చాడు. దీంతో జీఆర్పీ పోలీసులు చైల్డ్‌లైన్ సూపర్‌వైజర్ సి.అశోక్‌కు సమాచారం అందించి బాలుడిని చైల్డ్ హోంకు తరలించి బాలుడి వివరాలను బంధువులకు తెలియజేశారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీకి గురైన సెల్‌ఫోన్లను రికవరీ చేశారు. రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ చింతమనేని శ్రీనివాస్ రూ. 4.21 లక్షల విలువైన 24 సెల్‌ఫోన్లను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ... సీఈఐఆర్ పోర్టల్ అనుగుణంగా రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ సిబ్బందితో కలిసి సెల్‌ఫోన్లను నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బాధితులు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో, సిబ్బంది పాల్గొన్నారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగర్‌కాలనీ: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఎ.రాములు తెలిపిన వివరాల ప్రకారం.. కార్వాన్ సత్యన్నగల్లీ ప్రాంతంలో గత నెల 22న ఓ వ్యక్తి స్పృహలేకుండా ఫుట్‌పాత్‌పై పడి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు వైద్య చికిత్స ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి గత నెల 28న మృతి చెందాడు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాల తెలిసిన వారు టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

నేడు దొడ్డి కొమురయ్య వర్ధంతి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం కురుమ తదితరులు

అఫ్జల్‌గంజ్: సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య కురుమ వర్ధంతిని ఈ నెల 4న (నేడు) నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం కురుమ అన్నారు. ముస్లింజంగ్ పూల్ వంతెన వద్దనున్న సంఘం భవనంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 9.30 గంటలకు రవీంద్ర భారతిలో వేడుకలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, జైపాల్ యాదవ్, మల్లయ్య యాదవ్, క్యామా మల్లేశం, నోముల భగత్, దూదిమెట్ల బాల్‌రాజ్, గెల్లు శ్రీనివాస్ యాదవ్ తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి బండారు నారాయణ, హాస్టల్ ట్రస్ట్ చైర్మన్ కొలుపుల నరసింహ, జంట నగరాల అధ్యక్షుడు నర్స వినోద్ కుమార్, కొండల రాజు, ఎక్కాల కన్నా, విమల, టి అరుణ్ కుమార్, కరాటే శ్రీను, కుమార స్వామి, సదానంద్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు టి బాలమణి, కే సునీత, ఎం లక్ష్మీవిజయ, ఎం జగదాంబ, బి రాజు, కాలే అమర్‌నాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక సర్క్యులర్ జారీ చేయాలి


లక్ష్మీనారాయణకు మెమోరాండం అందజేస్తున్న బత్తుల రాంప్రసాద్, బోయిని ఎల్లేష్ మాదిగలు

అబిడ్స్: ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక సవరణ చట్టం అమలుపై రాష్ట్ర డీజీపీ ప్రత్యేక సర్క్యులర్ జారీ చేయాలని నేషనల్ అట్రాసిటీస్ ప్రివెన్షన్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్, హైదరాబాద్ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బోయిని ఎల్లేష్ మాదిగ కోరారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణను బుధవారం కలిసి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూలై 1వ తేదీ నుంచి ప్రారంభమైన నూతన చట్టాలు ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని నిర్వీర్యం చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రత్యేక చట్టం అయిన ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక సవరణ చట్టం 2015 అమలుపై ప్రజలు ఆందోళన చెందకుండా సర్క్యులర్ జారీ చేయాలని కోరారు.